www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 2 ఫిబ్రవరి 2024

5

వైఎస్ఆర్



సీటు బెల్టు, హెల్మెట్ తప్పనిసరి : డిటిసి

కడప : ప్రయాణ సమయంలో కారులో సీటు బెల్టు, టూ వీలర్‌పై హెల్మెట్ తప్పనిసరి అని, ధరించకపోవడం వల్ల అధిక శాతం రహదారి ప్రమాదాలు మరణాలకు కారణమవుతున్నాయని డిటిసి మీరా ప్రసాద్ పేర్కొన్నారు. 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు పురస్కరించుకొని వాహనదారుల్లో హెల్మెట్ ధారణ గూర్చి అవగాహన కల్పించడానికి గురువారం రవాణా శాఖ, ఐసిఐసిఐ సంయుక్త ఆధ్వర్యంలో భారీ హెల్మెట్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రమాద బాధితులు చనిపోతున్నారని తెలిపారు. ముఖ్యంగా టూవీలర్ యాక్సిడెంట్ సమయంలో తలకు హెల్మెట్ ధరించకపోవడంతో తలకు దెబ్బలు చనిపోతున్నారు. ర్యాలీలో ఎంవిఐ కృష్ణారావు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ విజయభాస్కర్, ప్రసాద్, లక్ష్మీ ప్రసన్న ట్రాఫిక్ సిఐ సీతారామిరెడ్డి వారి సిబ్బంది, ఐసిఐసి సిబ్బంది టూ వీలర్ డీలర్స్ పాల్గొన్నారు.



నిరాశాజనకమే

- వ్యవసాయ కోటాలో తగ్గుదల
- ఉక్కు పరిశ్రమ ఊసే లేదు
- రైల్వేలైన్ల ప్రస్తావనేదీ?
- వేతన జీవులకూ నిరాశే

కేంద్ర బడ్జెట్ నిరాశను మిగిల్చింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 ఓట్ ఆన్ బడ్జెట్‌ను గురువారం సుమారు రూ.47.66 లక్షల కోట్లతో ప్రవేశపెట్టారు. రాష్ట్ర విభజన చట్టంలోని హామీలైన ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, గనుల కేటాయింపు ఊసే కనిపించలేదు. రైల్వే బడ్జెట్‌లోనూ కడప-బెంగళూరు రైల్వేలైన్ సహా పెండింగ్ రైల్వే ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుల ప్రస్తావన చేయలేదు. విభజన హామీలను విస్మరించింది. కార్పొరేట్ల ప్రోత్సాహకాలు, పాడి రైతుల ప్రోత్సాహానికి ప్రత్యేక పథకాన్ని ఉటంకించింది. వేతనజీవులను నిరాశ పరిచింది. రైతుల ఆదాయం రెట్టింపు చేయడాన్ని విస్మరించి అధికం చేస్తామని పేర్కంది. గతేడాది వ్యవసాయానికి కేటాయించిన రూ.1.25 లక్ష కోట్లకు రూ. రెండు లక్షలను జత చేసి అత్తెసరు కేటాయింపులకు పరిమితం కావడం విస్మయాన్ని కలిగించింది.

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

కేంద్ర బడ్జెట్‌లో పెండింగ్ ప్రాజెక్టుల ప్రస్తావనే కొరవడింది. కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మల-సీతారామన్ 2024-25 బడ్జెట్ ప్రవేశపెట్టారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టుల కేటాయింపుల జాడే కనిపించలేదు. రాష్ట్ర విభజన చట్టంలోని హామీలైన ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, గనుల కేటాయింపు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి పెండింగ్ నిధులు, కడప-బెంగళూరు, కడప-విజయవాడ వంటి రైల్వే ప్రాజెక్టులకు కేటాయింపులు చేయాల్సి ఉంది. రూ.2.55 లక్షల కోట్లతో రైల్వేబడ్జెట్ ప్రస్తావన చేసింది. ప్రాజెక్టుల వారీగా కేటాయింపుల వివరాలు తెలియడం లేదు. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలనే ప్రధానమంత్రి తన హామీనే విస్మరించి అధికం చేస్తామనే ప్రకటనకు పరిమితం కావడం గమనార్హం. వ్యవసాయ అనుబంధ రంగాలైన గ్రామీణాభివృద్ధికి రూ.1.77 లక్షల కోట్లు కేటాయించింది. గతేడాది వ్యవసాయాభివృద్ధికి రూ.1.32,513 లక్షల కేటాయింపులను రూ.1.27 కోట్లకు కుదించింది. ఉమ్మడి జిల్లాలోని సుమారు ఐదు లక్షల మంది రైతుల్లో ఎందరికి ప్రయోజనాలకు కోతపడుతుందో తెలియడం లేదు. వేతన జీవుల ఆదాయ పన్ను శ్లాబుల్లో ఎటువంటి మార్పులు చేయకపోవడం నిరాశను కలిగించింది. ఫలితంగా ఉమ్మడి జిల్లాలోని 32 వేల మంది ఉద్యోగులు, 22,800 మంది పెన్షనర్లకు రిక్తహస్తాన్ని చూపించింది.

రైల్వే బడ్జెట్ రూ.2.55 కోట్లతో ప్రవేశపెట్టింది. గతేడాది 2.40 లక్షల కోట్ల నుంచి కొంతమేర పెంపుదల కనిపించింది. కానీ ప్రాజెక్టుల వారీగా వివరాలు తెలియడం లేదు. రాష్ట్ర విభజన జరిగిన పదేళ్ల గడిచిన నేపథ్యంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధుల విడుదల జాడే కనిపించలేదు. జిల్లాలోని పెండింగ్ రైల్వే ప్రాజెక్టులైన కడప-బెంగళూరు, కడప-విజయవాడ, ఓబులవారిపల్లి - కృష్ణపట్నం సివిల్ రైల్వే ప్రాజెక్టులకు కేటాయింపులపై అందరి దృష్టి నిలిచింది. రూ.86 లక్షల కోట్ల ఉపాధి హామీ పనుల కేటాయింపులు చేసింది. దేశవ్యాప్త ంగా 83 లక్షల స్వయం సహాయక సంఘాల్లోని తొమ్మిది కోట్ల మంది మహి ళలకు మేలు చేస్తామని పేర్కొంది. వీరితోపాటు దేశంలోని అంగన్వాడీలు, ఆశా లను ఆయుష్మాన్‌భారత్ పరిధిలోకి తీసుకుని రావడం కొంత ఉపశమనాన్ని కలి గించింది.

మొండిచేయి

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి రిక్తహస్తమే. విభజన చట్టంలోని వెనుకబడిన ప్రాంతాలైన రాయలసీమ, ఉత్తరాంధ్రలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ, విశాఖ రైల్వేజోన్, కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు వంటి ప్రధాన హామీలకు ఏళ్ల తరబడి అన్యాయమే చేస్తోంది. కడప- బెంగళూరు, కడప -విజయవాడ, కృష్ణపట్నం- ఓబులవారిపల్లి ప్యాసింజన్ రైల్వే లైన్, కడప నుంచి రాజధానికి రైలు ప్రస్తావన లేదు. కడప విమానాశ్రయం రన్‌వే పొడిగింపు పనుల కేటాయింపుల ప్రస్తావనే లేదు. రైతుల ఆదాయం రెట్టింపు హామీని తుంగలో తొక్కింది.

- జి.చంద్రశేఖర్, సిపిఎం జిల్లా కార్యదర్శి, కడప.

ఎన్నికల బడ్జెట్

2024 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ రూపల్పన చేసినట్లు కనిపించింది. సబ్‌కాసాత్ సబ్‌కా వికాస్ లేదు. మాటలను చేతలకు పొంతన లేదు. మౌలిక వసతుల కేటాయింపులు ఆదానీ, అంబానీలకే. రైతు ఆత్మహత్యల పరంపర కొనసాగుతోంది. నిరుద్యోగ సమస్య తాండవం చేస్తోంది. ఎపికి ఎటువంటి హామీ నెరవేర్చిన పాపాన లేదు. ద్రవ్యోల్బణాన్ని పెంచి సామా న్యుల జీవితాలను కడగండ్ల పాలు చేయడం విస్మయాన్ని కలిగిస్తోంది. కడప - బెంగళూరు, విజయవాడ రైల్వేప్రాజెక్టు ఊసేలేదు. స్టీల్‌ప్లాంట్, పోలవరానికి దిక్కు లేదు.

- జి.ఈశ్వరయ్య, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు.

మోసకారి బడ్జెట్

కేంద్ర బడ్జెట్ మేడిపండు చందం. రైతులు, యువత, మహిళలు, పేదల స్తంభాల మీద బడ్జెట్ పెట్టినట్లు చెప్పింది. లోతులను పరిశీలిస్తే లోన లొటారం పైన పటారమే. రైతులు ఆశించిన పిఎం కిసాన్ రూపాయి పెంచలేదు. వ్యవ సాయ రుణాలు రద్దు చేస్తారని నిరాశ కలిగించింది. మహిళలకు గ్యాస్, నిరుపేదలకు డిబిటి చేస్తార ఆశల్ని అడియాశలు చేసింది. 14 లక్షల కేంద్ర ఉద్యోగాల భర్తీ చేస్తారని ఆశించిన యువతను నిరాశ పరిచింది. ఎపికి టోపీ పెట్టింది. ప్రత్యేక హోదా, రాయలసీమ, ఉత్తరాంధ్ర బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీ, కడప స్టీల్, దుగ్గరాజపట్నం ఓడరేవు, విశాఖ మెట్రో, రైల్వేజోన్ వంటి హామీలను విస్మరించింది.

- ఎన్.తులసిరెడ్డి, పిసిసి మీడియా చైర్మన్.

రాజకీయాలు వేగంగా మారుతున్నాయి

- బిజెపితో జతకడితే టిడిపికే నష్టం
- రాష్ట్రంలో బిజెపికి ఉనికే లేదు
- పోటీ చేస్తే డిపాజిట్లు కూడా దక్కవు
- షర్మిల కేంద్రాన్ని ప్రశ్నించడాన్ని స్వాగతిస్తున్నాం
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ. గఫూర్

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయని, వైసిపికి నష్టం కలిగే పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని, 175కి 175 సీట్లు సాధిస్తామన్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి సొంతపార్టీ ఎమ్మెల్యేలు ఓడిపోతారన్న పేరుతో అభ్యర్థులను మార్చుకుంటున్నారని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ అన్నారు. గురువారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు వామపక్ష పార్టీలే బిజెపిని ప్రశ్నిస్తూ వచ్చాయని, ఇప్పుడు ఎపిలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వై.ఎస్.షర్మిలా కేంద్రాన్ని నిలదీయడం ప్రారంభించారని పేర్కొన్నారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన బిజెపికి దాసోహమైపోయాయని చెప్పారు. ఇప్పుడు టిడిపికి మంచి అవకాశం వచ్చిందని, దీన్ని దుర్వినియోగం చేసుకోవద్దని హితవుపలికారు. అధికారంలోకి వస్తామని టిడిపి చంకలు గుద్దుకోవద్దని, రాష్ట్రంలో బలం లేని బిజెపితో జతకడితే వామపక్ష, సెక్యులర్ సంఘాలు దూరమవుతాయని హెచ్చరించారు. ఈ విషయాన్ని టిడిపి ఇప్పటికైనా గుర్తించాలని పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని, ప్రశ్నించే వారిని, ప్రతిపక్ష పార్టీల నాయకుల మీదికి కేంద్ర ప్రభుత్వం సంస్థలు ఇడి, ఐటి దాడులకు ఉసిగొలుపుతుందని విమర్శించారు. ప్రాంతీయ పార్టీలను బిజెపి గుత్తాదిపత్యంతో నిలువరించాలని చూస్తుందని తెలిపారు. బీహార్. సిఎం నితీష్‌కుమార్‌ను బెదిరించి బిజెపి భాగస్వామ్యంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయిందని పేర్కొన్నారు. షర్మిలా వచ్చాక జిల్లాలో మార్పులు చోటుచేసుకున్నాయని చెప్పారు. టిడిపి, కాంగ్రెస్ మధ్య సయోద్య కుదిరితే వైసిపి అభ్యర్థులు ఓడిపోయే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సిపిఎం కేంద్ర కమిటీ సమవేశంలో అనేక విషయాలు చర్చించామన్నారు. బిజెపిని ఓడించకపోతే దేశంలో ప్రజాస్వామ్యం ఉండదని పేర్కొన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్నే మరుస్తారని హెచ్చరించారు. అధ్యక్ష పాలనవస్తుందని తెలిపారు. ప్రతిపక్షాలను, నిలదేసే వారిని బిజెపి సహించడం లేదని చెప్పారు. బిజెపిని ఓడించడమే లక్ష్యంగా రాబోయే రోజుల్లో సిపిఎం, సిపిఐ, మరి కొన్ని వామపక్షపార్టీలు, ప్రత్యేక సాధన కమిటీ, కాంగ్రెస్‌ను సర్దుబాటు చేయడానికి సిపిఎం ముందుకు పోతుందన్నారు. జనసేన బిజెపిని భుజనవేసుకుందని పేర్కొన్నారు. టిడిపి వచ్చేఎన్నికల్లో అవకాశాలను జారవిడుచుకుంటే నష్టపోతుందని హెచ్చరించారు. రాష్ట్రంలో బిజెపి తరుపున పురందరేశ్వరి, విష్ణువర్ధన్‌రెడ్డి పోటీచేసినా డిపాజిట్లు రావని చెప్పారు. రాష్ట్రానికి ఇచ్చిన ఏ ఒక్క హామీని నిలబెట్టుకుందా అని ప్రశ్నించారు. దేశానికి రక్ష మోడీ అనడంలో వాస్తవం లేదని, గతంలో మోడి లేకపోయినా దేశ సురక్షితంగా ఉందని పేర్కొన్నారు. ప్రజలు దేశాన్ని రక్షించుకుంటారని చెప్పారు. బిజెపితో పోతే టిడిపికి సమాధే అని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మనోహర్, కమిటీ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, శివకుమార్, నగర కార్యదర్శి ఎ.రామమోహన్, ఐద్వా జిల్లా అధ్యక్షులు ఐ.ఎన్.సుబ్బమ్మ పాల్గొన్నారు.

బిజెపికి రాజకీయ సాధనాలుగా ఇడి, సిబిఐ

బిజెపికి రాజకీయ సాధనాలుగా ఇడి, సిబిఐ వాడుకుంటూ ఉందని, ఆ పార్టీ చేతిలో టిడిపి, వైసిపి జనసేన కీలు బొమ్మలుగా మారాయని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ. గఫూర్ అన్నారు. సిపిఎం జిల్లా విస్తృత సమావేశం గురువారం జిల్లా కార్యాలయంలో ఐ.ఎన్.సుబ్బమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాంతీయ ప్రజల ప్రయోజనాలను కోసం నిలబడే ప్రాంతీయ పార్టీలను ఇవాళ బిజెపి ప్రభుత్వం ఇడి, సిబిఐలను ఉపయోగించి బెదిరించడం చాలా బాధాకరమైన విషయమని తెలిపారు. దేశంలో త్వరలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి మతోన్మాద పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో వామపక్షాల ఐక్యత కోసం సీట్లు సర్దుబాటులు ఉంటాయని స్పష్టం చేశారు.

ముద్దనూరు సిఐపై బదిలీ వేటు

ముద్దనూరు : బుధవారం వైసిపి, టిడిపి గ్రూపుల మధ్య చోటు చేసుకున్న ఘర్షణను నిలువరించడంలో సిఐ నరేష్ బాబు విఫలమయ్యారని ఉన్నతాధికారులు ఆయనపై బదిలీ వేటు వేశారు. అన్నమయ్య జిల్లా విఆర్‌కు బదిలీ చేసినట్లు గురువారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇదీలా ఉండగా అన్నమయ్య జిల్లా విఆర్‌లో ఉన్న సిఐ దస్తగిరికి ముద్దనూరు సిఐగా బాధ్యతలు అప్పగించారు.

పొదుపు సంఘాలకు భరోసా

బి.కోడూరు : పొదుపు సంఘాలకు భరోసా వైఎస్ఆర్ ఆసరా నిలుస్తోందని ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి పేర్కొన్నారు. మండలంలో ఎంపిడిఒ కాంప్లెక్స్ భవనలో గురువారం వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి ఒక్క కుటుంబానికీ ఆసరాగా నిలిచిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధా, ఎంపిపి, జడ్‌పిటిసి, నాయకులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

లూర్దుమాత ఉత్సవాలకు తరలిరండి

కడప అర్బన్ : నగరంలోని మరియాపురంలో వెలసిన లూర్దుమాత తిరుణాల మహోత్సవాలు ఈనెల 10, 11 తేదీలలో కడప అపోస్తులిక పాలన అధికారి బిషప్ రెవ గాలి బాలి ఆదేశాల మేరకు నిర్వహించనున్నట్లు విచారణ గురువు రెవ ఫాదర్ బిరుసు రాజా తెలిపారు. గురువారం మరియాపురంలోని పాత గుడి ఆవరణంలో మీడియా సమావేశం, ఎం పి ఎస్ ఎస్ ఎస్ డైరెక్టర్ తలారి బాలరాజు, సహాయ గురువు ఫాదర్ అరుణ్ లతో కలసి ఆయన తిరునాల పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎం.డి ఆల్ఫోన్స్, జయపాల్, జ్యోతి రాయప్ప, చర్చి ఉపదేశి గ్రగోరి పాల్గొన్నారు.

డాక్టర్ సరితకు అభినందనలు

కడప అర్బన్ : భారత ప్రభుత్వం నుంచి డిజైన్‌లలో పేటెంట్ స్వీకరించిన యోగి వేమన విశ్వవిద్యాలయం ఎంబిఎ సహ ఆచార్యులు డాక్టర్ పి.సరిత ఆమె బృందాన్ని విసి ప్రొఫెసర్ చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాధ రెడ్డి అభినందించారు. ఆమె భారత ప్రభుత్వం నుంచి 'డిజైన్ పేటెంట్'లో ఇంట్రలెక్షుయల్ ప్రాపర్టీ రైట్ ఆమోదం పొందడం శుభ పరిణామమన్నారు.

బద్వేల్ వైసిపి టికెట్ మాదిగలకే కేటాయించాలి

కడప అర్బన్ : వైసిపి అధిష్టానం బద్వేల్ ఎమ్మెల్యే టికెట్‌ను మాదిగలకే కేటాయించాలని, లేనిపక్షంలో తగిన గుణపాఠం చెబుతామని దళిత ప్రజా సేన రాష్ట్ర అధ్యక్షులు ఓబుల్ పతి, ఎస్‌సి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎన్. రాజా, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు వేదరూరు బాబు, నాయకులు డిమాండ్ చేశారు. గురువారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాబోయే శాసనసభ ఎన్నికలలో వైసిపి అభ్యర్థిగా తిరిగి మాలలకే ఇస్తారని ప్రచారం చేస్తున్నారని, వైసిపి అధిష్టానం ఆ ఆలోచనను విరమించుకోవాలని పేర్కొన్నారు. బద్వేలు స్థానాన్ని మాదిగలకే కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టం సుబ్బారావు.ఉపాధ్యక్షులు వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

జగన్‌ను మరోసారి ఆదరించాలి

చెన్నూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని, మళ్లీ ఆయన్ను ఆదరించాలని వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మా రాజేంద్రప్రసాద్ రెడ్డి, టిటిడి బోర్డు సభ్యులు మా సీమ బాబు అన్నారు. గురువారం మండల వ్యాప్తంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే రవీంద్రనాధరెడ్డి కమలాపురం నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి పథంలో నడిపించారని చెప్పారు. ఎలాంటి సమస్యలున్నా ఆయన దృష్టికి తీసుకెళితే వెంటనే స్పందించి పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి చీర్ల సురేష్ యాదవ్, వైసిపి మండల కన్వీనర్ జి ఎస్ భాస్కర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్‌విఎస్ఆర్, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భారీ మూల్యం చెల్లించక తప్పదు

ప్రజాశక్తి- కడప అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్న ఈ ప్రభుత్వం రాబోయే ఎన్నికలలో భారీ మూల్యం చెల్లించేందుకు సిద్ధంగా ఉండాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఎ.గఫూర్ హెచ్చరించారు. ఉద్యోగులకు ఆర్థిక బకాయిలను చెల్లించకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తున్నదంటే ప్రభుత్వమేమైనా దివాలా తీసిందా అని ప్రశ్నించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం కడప కలెక్టరేట్ వద్ద యుటిఎఫ్ చేపట్టిన రెండవ రోజు దీక్షలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు అనేక వాగ్దానాలతో ఉద్యోగులను నమ్మించి, ఉద్యోగ, ఉపాధ్యాయుల అండదండలతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ళుగా ఉద్యోగులను అడుగడుగునా వంచిస్తూనే ఉన్నారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన వారంలోపే కాంట్రిబ్యూటరీ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని మాట ఇచ్చి, ఐదేళ్లు కాలయాపన చేసి ఇప్పుడు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధ రించలేమంటూ తోక ముడిచారన్నారు. సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేపడితే నిర్బంధాలు విధించడం, నోటీసులు జారీ చేయడం, అరెస్టులు చేయడం ప్రభుత్వానికి పరిపాటిగా మారిందన్నారు. యుటి ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు చేస్తున్న ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం తగదన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు వై.రవికుమార్, జిల్లా కార్యదర్శులు ఎస్.ఎజాస్ అహ్మద్, ఎల్.చంద్ర ఓబుల్ రెడ్డి, ఎ.శ్రీనివాసులు, సి.వి.రమణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎస్.ఓబుల్ రెడ్డి, డి.రూతు ఆరోగ్య మేరీ, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.రాహుల్, జి.సునీల్ కుమార్, డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి డి.ఎం.ఓబులేసు దీక్షా శిబిరాన్ని సందర్శించి దీక్షలకు మద్దతు తెలిపారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వైసిపిలో 15 కుటుంబాల చేరిక

చెన్నూరు : మండలంలోని ఉప్పరపల్లి దళితవాడలో ఎమ్మెల్యే పోచం రెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మ రాజేంద్రప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి నుంచి వైసిపిలోకి సుమారు 15 కుటుంబాలు చేరాయి. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి సాధారంగా పార్టీల్లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేసిన ప్రజా సంక్షేమ పథకాలను చూసి ప్రజలు బ్రహ్మరథం పడుతు న్నారని తెలిపారు, పార్టీలో చేరిన వారికి కల్పి స్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి సురేష్ యాదవ్, వైసిపి మండల కన్వీనర్ జి.ఎన్ భాస్కర్ రెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి అధ్య క్షులు ఎర్ర సాని మోహన్ రెడ్డి, సీనియర్ నాయ కులు ఎర్ర సాని రాజగోపాల్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్ గాజులపల్లె సంపూర్ణం రెడ్డి, భోగాల కొండారెడ్డి, ఎంపిటిసి నిరంజన్ రెడ్డి, పాత కుంట శ్రీనివాసులు రెడ్డి, పుల్లారెడ్డి, చింత కుంట సాయిరాంరెడ్డి, నాయ కులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

తేక్వాండోలో 'గురుకుల్ విద్యాపీఠ్' ప్రతిభ

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని గురుకుల్ విద్యాపీఠ్ విద్యార్థులు బెంగళూరులో నిర్వహించిన తేక్వాండోపోటీలలో ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ ఎ.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులకు మంచి క్రమశిక్షణతో పాటు ఆట పాటలలో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. అందులో భాగంగానే బెంగుళూరు యూనివర్సిటీలో నిర్వహించిన 6వ విఫా కప్ నేషనల్ తేక్వాండో చాంపియన్‌షిప్ -2024 పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు 21 మంది హాజరై విఫా కప్పును కైవసం చేసుకోవడం సంతోష దగ్గర విషయమన్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ ఎ.వీరకుమారి, సిఇఒ వివేకానంద, పల్లవి, ప్రిన్సిపల్ ముని చంద్ర, వైస్ ప్రిన్సిపాల్ నరసింహ అభినందించారు. అనంతరం విజయానికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి విజయానికి కారకురాలైన విజయలక్ష్మిని సన్మానించారు.



పతకాలతో గురుల్ విద్యాపీఠ్ విద్యార్థులు

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - కడప



మాట్లాడుతున్న స్వర్ణప్రసాద్

ప్రతి ఒక్కరికీ ప్రజా వినియోగిత సేవల చట్టాలపై అవగాహన ఉండాలని పర్మనెంట్ లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక రిమ్స్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఐపి బిల్డింగ్ 3వ ఫ్లోర్ క్లినికల్ లెక్చర్ గ్యాలరీలో 'శాశ్వత లోక్ అదాలత్' ఆధ్వర్యంలో 'ప్రజా వినియోగిత సేవా రంగాల్లో న్యాయ సేవలపై' రిమ్స్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆర్ఎం ఒలు, హెఒడిలు, హెడ్‌నర్సులు, మినిస్ట్రియల్ స్టాఫ్‌తో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్మినెంట్ లోక్ అదాలత్ అందించే తీర్పు భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పుతో సమానమని చెప్పారు. పర్మినెంట్ లోక్ అదాలత్ (పిఎల్ఎ) ద్వారా ఫిర్యాదుదారులు ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా సత్వర న్యాయ పరిష్కారం అందిస్తారన్నారు. కార్యక్రమంలో రిమ్స్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.వి. రమాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ సూరేశ్వర్ రెడ్డి, ఆర్ఎంఒలు, హెచ్ఒడి లు, హెడ్ నర్సులు, మినిస్ట్రియల్ స్టాఫ్ పర్మనెంట్ లోక్ అదాలత్ మెంబెర్ ఆదినారాయణ పాల్గొన్నారు.



పట్టాను పంపిణీ చేస్తున్న డిప్యూటీ సిఎం, మేయర్

సొంతింటి కల సాకారం : డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - కడప

పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఘనత మన రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రమే దక్కుతుందని ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా, నగర మేయర్ సురేష్ బాబు సంయుక్తంగా పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని కడప వైఎస్ఆర్ ఆడిటోరియంలో 4వ విడత 'నవరత్నాలు - పేదలందరికీ ఇంటి పట్టాలు' పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 4వ విడతలో భాగంగా కడప నగరంలోని వివిధ జగనన్న లేఅవుట్లలో ఇంటి స్థలాలు పొందిన 720 మంది మహిళలకు మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని చెప్పారు. కడప పట్టణ పరిధిలో మొదటి విడతలో 20,787 మంది పేద మహిళలకు, రెండవ విడతలో 922 మందికి, మూడవ విడత 498 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు మంజూరు పత్రాలను పంపిణీ చేశామన్నారు. చాలావరకు ఇళ్లు పూర్తి చేసుకుని నివాసాలు కూడా ఉండగా మరికొందరు వివిధ దశల్లో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి, ప్రస్తుతం నాల్గవ విడతలో 720 మందికి ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సోషియల్ వెల్ఫేర్ చైర్మన్ పులి సునీల్ కుమార్, వైసిపి సీనియర్ నాయకుడు అఫ్జల్ ఖాన్, వివిధ కార్పొరేటర్లు, నాయకులు తహశీల్దార్ శివరామిరెడ్డి, గృహ నిర్మాణశాఖ అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

యువతను దగా చేసిన సిఎం : డివైఎఫ్ఐ

కడప అర్బన్ : మెగా డిఎస్‌సిని విడుదల చేస్తానని తక్కువ పోస్టులతో డిఎస్‌సిని ప్రకటించి యువతను సిఎం దగా చేశారని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం.చిన్ని, వీరనాల.శివకుమార్ పేర్కొన్నారు. 25,000 పోస్టులతో మెగా డిఎస్‌సి విడుదల చేయాలని, మినీ డిఎస్‌సిని నోటిఫికేషన్ రద్దు చేయాలని కోరుతూ గురువారం పూలే సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వస్తే మెగా డిఎస్‌సి ఇస్తానని హామీ ఇచ్చి నాలుగు సంవత్సరాలు తర్వాత ఉసూరు మనిపించేలా 6,100 పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగులను మోసం చేశారన్నారు. డివైఎఫ్ఐ పోరాట ఫలితంగా డిఎస్‌సికి ప్రతిపాదనను మంత్రి మండలి ఆమోదించడంపై హర్షం వ్యక్తం చేశారు. కానీ తక్కువ పోస్టులలో డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం డిఎస్‌సి అభ్యర్థుల ఆవేదనను దృష్టిలో ఉంచుకుని నోటిఫికేషన్ నాటికి జూన్ వరకు ఉద్యోగ విరమణ అవుతున్న ఉపాధ్యాయుల సంఖ్యను ఇందులో చేర్చి పోస్టులు సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రెండేళుఅప్రెంటిష్ విధానాన్ని తీసుకోరావడం ఏమిటని ప్రశ్నించారు. 25వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే 6100 పోస్టులు భర్తీ అనడం నిరుద్యోగులను మోసం చేయడమే. నాలుగు సంవత్సరాల నుంచి 10 లక్షల మంది అభ్యర్థులు నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే మెగా డిఎస్‌సిని ప్రకటించాలని ఇది దగా డిఎస్‌సి అని విమర్శించారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన పోరాటంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరూ అదే స్ఫూర్తితో పోరాటాలు కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర అధ్యక్షులు షేక్. షాకీర్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ నరసింహులు, జిల్లా సహాయ కార్యదర్శి తులసిస్వర్ యాదవ్, నాయకులు అంజి, ముస్తఫా, బాల గురయ్యా, మల్లికార్జున, మహేష్ పాల్గొన్నారు.

ఆర్ఐఒగా వెంకటసుబ్బయ్య

కడప అర్బన్ : బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ జిల్లా రీజినల్ ఇన్‌స్పెక్టర్ ఆఫీసర్ గా బి.వెంకటసుబ్బయ్యను ఇంటర్మీడియట్ బోర్డు నియమించింది. ప్రస్తుతం ఆయన వెంకటసుబ్బయ్య మహిళా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా ఉన్నారు. ఇంటర్మీడియట్ బోర్డు వైఎస్ఆర్ జిల్లా నూతన రీజినల్ ఇన్‌స్పెక్టర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరిలో ప్రాక్టికల్స్, మార్చిలో థియరీ పరీక్షలు ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశానుసారం నిర్వహిస్తామని తెలిపారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించి జిల్లాకు మంచి ఫలితాలు రావడానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో డిఇఒ జి. శ్రీనివాసులరెడ్డి, డిఇసి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పిఎల్ఐ డే

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప డివిజన్, కడప ప్రధాన పోస్టల్ కార్యాలయంలో గురువారం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ రాజేష్ పిఎల్ఐ డేను ఘనం గా నిర్వహించారు. ప్రజలకు, ఖాతాదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఖాతాదారులకు బాండ్, పాస్ పుస్తకాలు ఇచ్చారు. బాగా పని చేసిన గణేష్ రెడ్డి, ఝాన్సీ లక్ష్మిని బహుమతులతో సత్కరించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ అతి పురాతనమైన కేంద్ర ప్రభుత్వంచే నడుప బడుతున్న ఏకైక ఇన్సూరెన్స్ పిఎల్ఐ అని పేర్కొన్నారు. ఇందులో కడప డివిజన్ ఎఎస్‌పిలు అంచెల విజయ భాస్కర్, భాస్కర్ రెడ్డి, పిఎల్ఐ డెవలప్మెంట్ ఆఫీసర్ మునాఫ్, ప్రధాన కార్యాలయం పోస్టుమాస్టర్ మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.



బహుమతి అందిస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్

అమృత్‌నగర్‌లో పడకేసిన పారిశుధ్యం

20 ఏళ్లుగా స్థానికులు మురుగుతో సహవాసం - విషపురుగులు, పందుల సంచారం - పలుమార్లు మొరపెట్టుకున్న ఫలితం శూన్యం



నీటి కుంటలోనే బోరింగ్, ఇంటి ముంగిటే మురుగు నీరు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని అమృత్‌నగర్‌లో పారిశుధ్యం పడకేసింది. మురికినీటి పారుదల వ్యవస్థలేకపోవడంతో వర్షపునీరు. ఇళ్లలోని వృథా నీరు ఎక్కడికక్కడి నిలిచిపోతోంది. ఊరంతా మురికినీటిమయం. అమృత్‌నగర్ ఫేస్-2లోని 1వ వీధినుండి 35వ వీధి వరకు ఇలాంటి పరిస్థితి నెలకొంది. నివాసాల మధ్య మురినీటి కుంటలు ఉండడంతో దోమలబెడద అధికంగా ఉందని స్థానికుల వాపోతున్నారు. దోమకాటుతో పిల్లలకు వృద్ధులు రోగాలబారిన పడుతున్నారు. ఇక్కడందరూ కూలినాలి చేసుకుని జీవించేవారే. ఆర్‌ఎంపిలు తప్ప చెప్పుకోదగ్గ వైద్యులు లేకపోవడంతో సుమారు 5కి.మీ.దూరంలోని ప్రొద్దుటూరుకు రావలిసిందే. మురికినీటి కుంటలు ఉండడంతో పందులు, విషపురుగులు సంచారం ఎక్కువగా ఉంది. చీకటి పడితే స్థానికులు బయటకు రావాలంటే బెంబేలెత్తుతున్నారు. ఒక ఇంటి మురికినీరు పక్కనున్న ఇంటి ముంగిటకు పోతుండడంతో ఇరుగుపొరుగు వారు ఘర్షణలకు కూడా పాల్పడుతూ పోలీస్‌స్టేషన్ వరకు వెళుతున్న సంఘటనలు కూడా ఉన్నాయి. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామని స్థానికులు తెలిపారు. 20ఏళ్లుగా తమ పరిస్థిలు ఇలాగే ఉన్నాయని వారు వాపోతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా.. తమ ఊరి స్థితులు మారలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో మంది అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా చేస్తాం.. చూస్తాం అని అంటున్నారేగానీ ఒక్కరూ కూడ చిత్తశుద్ధితో చేసిందిలేదన్నారు. ఊరి పరిస్థితులు మారాలని పలు మార్లు తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నాలు చేసి వినతిపత్రాలు అందజేశామన్నారు. అవన్నీ బుట్టదాఖలేనని ఆందోళన చెందుతున్నారు. ఇటీవల జనవరి17న కొత్తపల్లి సర్పంచ్‌కు వినతిపత్రం ఇవ్వగా 18వ తేదీన పంచాయతీ కార్యదర్శి చూసి వెళ్లడమే కాని ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. తమ గ్రామ దుస్థితి వెలుగులోకి తేవాలని ప్రజలు ఒకడగు ముందుకేసి పత్రికల వారికి విషయం తెలిపి పత్రికల్లో కథనం ప్రచురితమైతే సమాచారం ఇచ్చిన వారు పంచాయతీ సిబ్బంది ధూషణలకు గురి కావలసి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ ఊరి పరిస్థితులు మెరుగుపరచాలని స్థానికులు కోరుతున్నారు.

దుర్గంధం తట్టుకోలేకున్నాం



మురికినీరు వెదజల్లుతున్న దుర్గంధాన్ని తట్టుకోలేకున్నాం. సమస్యను పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఏ ఫలితం లేదు. ఇప్పటికైనా వారు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

- నాగమ్మ, 12వ వీధి

విషసర్పాలతో భయంగా ఉంది



ఇంటి చుట్టూ మురికి ఉండడంతో విషసర్పాలు తరచూ తిరుగుతున్నాయి. పిల్లలతో ఆందోళనకరంగా ఉంది. చీకటిపడితే భయమేస్తోంది. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి.

- కుల్లాయమ్మ, 4వ వీధి

అధికారుల చర్యలు శూన్యం



సమస్యను అధికారులకు పలుమార్లు విన్నవించాం. పట్టించుకోలేదు. భయంతో సంసారం చేయలేకున్నాం. పిల్లలు, వృద్ధులు బయటకు వెళ్లాలంటే హడలిపోతున్నారు. ఎన్నేళ్లని ఇలా బతకాలి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- లక్ష్మిదేవి, 5వ వీధి

ఘనంగా జయచంద్రారెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - వేంపల్లె



జయచంద్రారెడ్డికి కేక్ తినిపిస్తున్న టిడిపి నాయకులు

వేంపల్లెలోని గాండ్ల వీధిలో టిడిపి నాయకులు, అభిమానుల మధ్య వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ జయచంద్రారెడ్డి పుట్టిన రోజు వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గాండ్ల వీధిలో కేక్ కట్ చేశారు. టిడిపి నాయకులు, అభిమానులు, స్నేహితులు పెద్ద ఎత్తున బాణసంచా పేల్చారు. కార్యక్రమంలో మాజీ గండి చైర్మన్ ఎస్‌వి రమణ, టిడిపి నాయకులు డివి సుబ్బారెడ్డి, ఆర్‌వి రమేష్, మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వలి, కొండారెడ్డి, రామాంజనేయరెడ్డి (చంటి), ప్రసాద్, వెంకట సుబ్బయ్య, మాజీ ఎంపిటిసి వెంకటయ్య, మారుతి, గంగయ్య, హరిజనవాడ గురప్ప, ఇడుపులపాయ పిపి చెంద్రాయుడు, రాముడు, సయ్యద్మ పీరా, వెల్డింగ్ బాషా, మహబూబ్ షరీఫ్, రమణ, గిరి, పలువురు టిడిపి నాయకులు, అభిమానులు, స్నేహితులు పాల్గొన్నారు.

నేడు నియోజకవర్గ అభివృద్ధిపై చర్చా వేదిక

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు నియోజకవర్గ అభివృద్ధిపై శుక్రవారం స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో చర్చా వేదిక ఏర్పాటు చేస్తున్నట్లు రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎవి రమణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రజలు మేధావులు, సామాజిక, ప్రజా సంఘాల నాయకులు మైదుకూరు నియోజకవర్గ అభివృద్ధి ఇప్పటివరకు జరిగింది.. జరగవలసినది అనే అంశంపై చర్చావేదికలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రైతు సేవా సమితి నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు సహదేవుడు రామాంజనేయులు పాల్గొన్నారు.

నూతన తహశీల్దార్ల నియామకం

ప్రజాశక్తి - చాపాడు

ఎన్నికల బదిలీల్లో భాగంగా మైదుకూరు నియోజకవర్గ పరిధిలోని 5 మండలాలకు నూతన తహశీల్దార్లను ఉన్నతాధికారులు నియమించారు. మైదుకూరు తహశీల్దార్‌గా నరేంద్రనాథ్‌రెడ్డి, చాపాడు తహశీల్దార్‌గా భూషణం, ఖాజీపేట తహశీల్దార్‌గా వెంకటలక్ష్మి, బ్రహ్మంగారిమఠం తహశీల్దార్‌గా శివరామన్, దువ్వూరు తహశీల్దార్‌గా ఉమారాణి నియమితులయ్యారు. గతంలో ఆయా ప్రాంతాల్లో పనిచేస్తున్న తహశీల్దార్లను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు.

ఖాజీపేట సిఐగా రామాంజులు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - ఖాజీపేట



ఖాజీపేట సిఐగా పి.రామాంజులు గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి విధులు నిర్వహించేవారు. ఆయన మైదుకూరు ఎస్ఐగా బదిలీ అయ్యారు. ఖాజీపేట పోలీస్‌స్టేషన్‌ను ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేయడంతో నూతనంగా సిఐ పోస్ట్ మంజూరైంది. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సిఐ రామాంజులు మాట్లాడుతూ.. ట్రాఫిక్, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేకదృష్టి సారించనున్నట్లు తెలిపారు. అంతేకాక శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ప్రజలు సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సిఐ కోరారు.

వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

యువత స్వామి వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకోవాలని వివేకానంద ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జీవితం-యువతకు ఆదర్శం అనే అంశం మీద పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ భూమిరెడ్డి వెంకటసుబ్బయ్య అధ్యక్షతన చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ దేశం కోసం, ధర్మం కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. స్వామి వివేకానందుని బోధనలు ఆచరించదగినవన్నారు. రామకృష్ణారెడ్డి కృషిని అభినందిస్తూ ఎన్‌ఎస్‌ఎస్ పిఒ డాక్టర్ బత్తుల ఏకో నారాయణ ఘనంగా సత్కరించారు. అనంతరం కళాశాలలోని 110 మంది యువతకు స్వామి వివేకానంద జీవితం-సందేశం పుస్తకాలు, ప్రతిభ కలిగిన యువతకు ప్రశంస పత్రాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాతకోట శ్రీనివాసరెడ్డి, టి వెంకటసురేష్, విజయ్, శ్రీనాథ్, నరసింహ, అధ్యాపకులు ఎం.చంద్రఓబుల్‌రెడ్డి, బాలవీరన్న, నరహరి, రమణనాయక్, జ్యోతి, శైలజ, నాయబ్ రసూల్, నర్సింహులు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌లో ఎస్‌పి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - దువ్వూరు

దువ్వూరు పోలీసుస్టేషన్‌ను ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని ఎస్ఐ శ్రీనివాసులును ఆదేశించారు. సిబ్బంది పని తీరును అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. పోలీసులకు తగిన సూచనలు చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

క్రైం కార్నర్

బావిలోకి కారు దూసుకెళ్లి ఇద్దరు మృతి

ప్రజాశక్తి - లింగాల



ప్రమాదానికి కారణమైన బావి

మండల పరిధిలోని ఇప్పట్ల గ్రామ సమీపాన బుధవారం అర్ధరాత్రి కారు బావిలోకి దూసుకెళ్లడంతో అందులో ఉన్న ఇద్దరు మృతి చెందినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలు.. ఢిల్లీకి చెందిన అరటికాయ వ్యాపారులు సునీల్ కుమార్ తల్వా (42), ప్రకాష్ ఠాగూర్ (45) మతి చెందారు. వీరు అరటికాయల వ్యాపార నిమిత్తం పులివెందుల పరిసరాల్లో రైతుల వద్ద అరటికాయలు కొనుగోలు చేసి ఢిల్లీ ప్రాంతాలకు ఎగుమతి చేస్తుండేవారు. ఇందులో భాగంగా బుధవారం పార్నపల్లి గ్రామంలో అరటికాయలను చూచి, రాత్రి 11 గంటల ప్రాంతంలో పులివెందులకు కారులో బయల్దేరారు. ఇప్పట్ల వద్దనున్న జంట బావుల వద్ద వీరి కారు అదుపుతప్పి బావికి వేసిన రక్షణ గోడను ఢీ కొట్టి అందులో పడిపోయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. గురువారం ఉదయం ఆ దారి నుంచి వెళుతున్న కొందరు విషయాన్ని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల సంఘటనాస్థలానికెళ్లి పరిశీలించారు. మృతదేహాలను బయటకు తీసి పరీక్ష కోసం పులివెందుల ఏరియా ఆసుపత్రి పంపారు. బావిలో పడిన కారును లింగాల పోలీస్ స్టేషన్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - వల్లూరు

కడప-తాడిపత్రి జాతీయ రహదారిపై మండలంలోని గోటూరు జింకలవంక మార్గం మధ్యలో గురువారం కడప నుండి ఎర్రగుంట్ల వైపు వెళుతున్న ట్రాక్టర్‌ను, కడప నుండి గోటూరు వైపు వస్తున్న ద్విచక్ర వాహనం ట్రాక్టర్ వెనుక వైపు ఢీకొంది. ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. క్షతగాత్రుడు వల్లూరు మండలం కొత్తగాలివారి పల్లి చెందిన పాలవ్యాపారి గంగిరెడ్డిగా గుర్తించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారించి, కేసు నమోదు చేస్తామన్నారు.

అల్లుడ్ని చంపిన కేసులో మామకు జీవిత ఖైదు

ప్రజాశక్తి - కాశినాయన

అల్లుడ్ని చంపిన కేసులో మామకు జీవిత ఖైదు విధించినట్లు ఎస్ఐ అమర్నాథ్ రెడ్డి తెలిపారు. ఆయన చెప్పిన వివరాల మేరకు.. 2018 ఆగస్టు 5న కోడిగుడ్లపాడు గ్రామంలో రాజేష్‌రెడ్డి అనే వ్యక్తిని అతని మామ సంజీవరెడ్డి కత్తితో పొడిచి చంపాడు. కుటుంబ కలహాలతో హత్యకు గురైన రాజేష్‌రెడ్డి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. దీనిపై విచారించిన కోర్టు నేరం రుజువు కావడంతో గురువారం ముద్దాయికి జీవితఖైదుతోపాటు రూ.500 జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

బెదిరింపు ధోరణిలో అధికారులు : సిపిఎం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)



ఆందోళనలో మాట్లాడుతున్న లబ్ధిదారులు

స్థానిక అమృత్‌నగర్‌లో ప్రభుత్వ అధికారులు మౌలిక వసతులు కల్పించకపోగా.. పట్టా ఇచ్చి 12ఏళ్లవుతోందని ఇల్లు కట్టకపోవడం మీ తప్పని అధికారులు బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట అమృత్‌నగర్ లబ్ధిదారులు మౌలిక వసతులు కల్పించాలంటూ 8వ రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తుంటే అధికారులకు నిమ్మకునీరెత్తినట్లు ఉందన్నారు. పేదవారం లక్షలు ఖర్చుచేసి బేస్ మట్టాలు, ఇల్లు నిర్మాణం చేసుకున్నా మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారన్నారు. కాలనీలో మౌలిక వసతుల కల్పన సమస్య పరిష్కారం అయ్యే వరకు ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఫాతిమా, ఈశ్వరమ్మ, పర్వీన్, లతా, సాబీర్, రమణ లబ్ధిదారులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం చేస్తున్న టిడిపి నాయకులు

విభిన్నప్రతిభావంతుడికి ఆర్థిక సాయం

ఖాజీపేట : మండలం పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన విభిన్నప్రతిభావంతుడు అనగొండ ఆంజనేయులును టిడిపి మండలశాఖ అధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి గురువారం పరామర్శించి రూ.5000 ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ టిడిపి సానుభూతిపరుడు, స్వతహాగా విభిన్నప్రతిభావంతుడైన అనగొండ ఆంజనేయులు ఇటీవల కొత్తపేట వద్ద ప్రమాదానికి గురై కడపలో చికిత్స తీసుకొని స్వగహానికి చేరుకున్నారని తెలిపారు. ఎంపిటిసి భాస్క ర్‌రెడ్డి, కొత్తపేట బుజ్జిరెడ్డి, పుల్లయ్య నాయుడు నంద్యాల సుబ్బయ్య, ఐ టిడిపి మండల అధ్యక్షులు పాపన మల్లికార్జునరెడ్డి, కల్లూరు రామకృష్ణారెడ్డి, తిప్పాయపల్లి నాగ సుబ్బయ్య, శివారెడ్డి పాల్గొన్నారు.

వృత్తి విద్యతో జీవితంలో రాణించొచ్చు

ప్రజాశక్తి - చాపాడు

వృత్తి విద్య శిక్షణలో భాగంగా ప్రత్యక్షంగా బోధించిన అనుభవాలు ఎంతో ఉపయోగమని కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపల్ కె.నాగలక్షుమ్మ తెలిపారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులకు వృత్తి విద్య శిక్షణలో భాగంగా ఐసెక్ట్ వారి సహకారంతో గురువారం లీలాసాయి కుట్టు మిషన్ కేంద్ర సందర్శనకు తీసుకెళ్లారు. ఆ కేంద్రంలో మిషన్ భాగాలు, కుట్టు విధానం, ఫ్యాషన్ డిజైన్ గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ తరగతి గదిలో పుస్తకాలను చదవడం, క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయడంలో చాలా తేడాలు ఉంటాయన్నారు. వృత్తి విద్యలో శిక్షణ పొందడం వల్ల జీవితంలో రాణించవచ్చని తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ టి.లక్ష్మీనరసమ్మ, వృత్తి విద్యా శిక్షకులు జి.రాణి, ఉపాధ్యాయులు ఎస్.ఖదిరున్నిసా, విద్యార్థులు పాల్గొన్నారు.

లింగాల ఎంపిడిఒగా జ్యోతిష్ణ

లింగాల : లింగాల ఎంపిడిఒగా జ్యోతిష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. మరికొద్ది రోజుల్లో జరిగే ఎన్నికల నేపథ్యంలో మండలస్థాయి అధికారులను బదిలీ చేస్తున్నారు. అనంతపురం జిల్లా బుక్క రాయసముద్రం మండలంలో విధులు నిర్వహించే జ్యోతిష్ణ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపిడిఒ సురేంద్రనాద్ పులివెందులకు వెళ్లారు.

విధి నిర్వహణలో భేష్

ప్రొద్దుటూరు : పట్టణ పరిధిలోని 2టౌన్ సిఐ ఇబ్రహీం అంకితభావం, చిత్తశుద్ధితో విధులు నిర్వహించి జిల్లా ఉన్నతాధికారులతో భేష్ అనిపించుకున్నారని 14వ వార్డు కౌన్సిలర్ జీలాన్‌బాషా అన్నారు. శ్రీనివాస నగర్‌లోని నూరాని మసీదు కమిటీ పెద్దలతో కలిసి గురువారం సిఐ ఇబ్రహీంను సన్మానించారు. ఒకే వారంలో ఇరువురు ఉన్నతాధికారులతో విధి నిర్వహణలో భేష్ అనిపించుకున్న సిఐ ఇబ్రహీం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో సమాజానికి అవసరమైన ఉత్తమ సేవలందించి మంచి పోలీస్ అధికారిగా ఎదగాలని జిలాన్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో 9వ వార్డు కౌన్సిలర్ మన్యం సత్యం, మసీదు కమిటీ అధ్యక్షుడు టప్పా మహబూబ్‌బాషా, సభ్యులు గఫార్, ఇలియాస్, విసివుల్లా, అన్వర్, సలావుల్లా, ఖాదర్, గౌస్‌పీర్, షఫీ, అలీ, అబ్దుల్ రసూల్ పాల్గొన్నారు.

కుష్టు లక్షణాలు కనిపిస్తే వైద్యుడ్ని సంప్రదించాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

కుష్టు వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుడ్ని సంప్రదించాలని రూబీ అధికారి డాక్టర్ రవిబాబు సూచించారు. మండల పరిధిలోని చిలంకూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా లెప్రసీ, రూబీ అధికారి డాక్టర్ రవిబాబు గురువారం తనిఖీ చేశారు. కుష్టు వ్యాధిగ్రస్తుల పరిశీలన, మందుల పంపిణీని పరిశీలించారు. అనంతరం స్థానిక వివేకానంద పాఠశాలలో ఏర్పాటు చేసిన కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్పర్శ లేని పొడలు, రాగి రంగు మచ్చలు, తిమ్మిర్లు, కాళ్లు చేతుల నరాల బలహీనత వంటి లక్షణాల ద్వారా కుష్టు వ్యాధిని గుర్తించవచ్చు అన్నారు. జిల్లా వైద్యాధికారులు విక్టర్, మనోహర్, మండల కుష్టు వ్యాధి నివారణ అధికారి వీరభద్రయ్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సుచరితరెడ్డి, గణేష్‌రెడ్డి, హెల్త్ ఎడ్యు కేటర్ నాగమునిరెడ్డి, హెల్త్ సూపర్వైజర్ సుభద్ర, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా డికెటి పట్టాలు ఇవ్వొద్దు

పులివెందుల రూరల్ : ఎన్నికల నోటిఫికేషన్ మరికొద్ది రోజుల్లో వస్తుండగా ఇప్పుడు ప్రభుత్వ భూ ములను పంపిణీ చేయాలనే ప్రయత్నాలను ఆపా లని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రామ గోపాల్‌రెడ్డి పులివెందుల ఆర్‌డిఒ వెంకటేశ్వర్లును కోరారు. ఆర్‌డిఒ కార్యాలయంలో గురువారం ఆయన ఆర్‌డిఒతో మాట్లాడుతూ ముఖ్యంగా వేముల మండలం నల్లచెరువుపల్లి రెవెన్యూ పరిధిలో అనర్హులకు డికెటి ఇవ్వాలని ప్రయత్నిస్తున్నారన్నారు. పేదలకు కాకుండా వైసిపి నాయకులు వాటిని చేజిక్కించుకోవాలని చూస్తున్నారన్నారు. గతంలో జరిగిన భూ పంపిణీలో అనర్హులకు ఇచ్చి, మళ్లీ వాటిని రద్దు చేశారన్నారు. ఎన్నికల ముందర వీటిని అపివేయాలని కోరారు. ఇందుకు ఆర్‌డిఒ స్పందిస్తూ ప్రస్తుతానికి అలాంటి ఆలోచన లేదన్నారు. ఏదైనా అసైన్‌మెంట్ ద్వారా జరుగుతుందన్నారు. మీకు తెలియకుండా ఏమీ చేయమని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి రమణారెడ్డి పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి అండగా ఉంటా

జమ్మలమడుగు రూరల్ : నియోజకవర్గ పరిధిలోని ప్రతి కుటుంబానికి అండగా ఉంటానని చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని అంజనాపురం, అనంతగిరి గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి పేద, మధ్యతరగతి వారిని, నిరుద్యోగులను తీవ్ర ఇబ్బంది పాల్జేశారన్నారు. రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, దేవగుడి యూత్ నాగేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ బాలుగ్రం, శ్రీను, ప్రసాద్, రామాంజనేయులు, నాగరాజు, మారయ్య, రామకృష్ణ, రాముడు, రామాంజి, రామచంద్రుడు, రాము, శ్రీరాములు, త్రిదేవ్, పుల్లయ్య, రవి, పార్టీ నాయకులు, కార్య కర్తలు, దేవగుడి కుటుంబ అభిమానులు పాల్గొన్నారు.

తహశీల్దార్ గుర్రప్పకు వీడ్కోలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జమ్మలమడుగు తహశీల్దార్ గుర్రప్ప నంద్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం రెవెన్యూ కార్యాలయ సిబ్బంది ఆయనకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఏడాది కాలంలో ఉత్తమ సేవలు అందించి ప్రజల నుంచి, అధికారుల నుంచి మన్ననలు పొందారు. తనకు సహకరించిన రెవెన్యూ సిబ్బందికి, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కార్యాలయ సిబ్బంది గుర్రప్పను ఘనంగా సన్మానించారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా డిటి వేణుగోపాల్‌ను నియమించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దువ్వూరు : ఎన్నికల నేపథ్యంలో బదిలీపై సత్యసాయి జిల్లాకు వెళుతున్న దువ్వూరు తహశీల్దార్ రామకుమారిని గురువారం సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలక్షన్‌లో భాగంగా బదిలీపై తనను అనంతపురం జిల్లాకు బదిలీ చేశారని, ఇక్కడ సిబ్బంది ఎంతో సహకరించారని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సాయం చేసే గుణం ఉండాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

అనాథలు, అభాగ్యులకు అండగా ఉంటూ సహాయం చేసే గుణం ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని ఆల్ ఇండియా ట్రూ క్రిస్టియన్ కౌన్సిల్ ట్రస్ట్ కడప డిస్ట్రిక్ ఉమెన్స్ కమిటీ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, సిబిటి జమ్మలమడుగు ప్రిన్సిపల్ పాస్టర్ రాజేంద్ర పేర్కొ న్నారు. పట్టణంలోని క్యాంబెల్ హాస్పిటల్‌లో ఉన్న 30 మంది రోగులకు, బాలింతలకు గురువారం పండ్లు, బ్రెడ్ ప్యాకెట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రమ్య, గాయత్రి, బి.మటం కో-ఆర్డినేటర్ నరేంద్ర, సుభాష్, దావీదు, గాయకులు చంటి పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే పలు సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - చాపాడు

టిడిపి అధికారంలోకి రాగానే పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని అక్కులాయపల్లె, విశ్వనాథపురం గ్రామంలో గురువారం ఆయన బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టా ప్రతి ఇంటింటికీ వెళ్లి అక్కచెల్లెమ్మలను, ప్రజలతో మాట్లాడుతూ బాబు ప్రకటించిన మేనిఫెస్టోలోని పథకాలను వివరించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు భీమయ్య, జనసేన ఇన్‌ఛార్జి పందిటి మల్హోత్రా, సివిఎస్, సత్యం, ఓబులేసు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు .

పాత్రికేయులను అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలకు పాత్రికేయులను అనుమతించకపోవడం రాజ్యాంగ విరుద్ధమని మాజీ ఎమ్మెల్యే ఎన్.వరద రాజులరెడ్డి పేర్కొన్నారు. స్థానిక తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కౌన్సిల్లో జరిగే, జరగబోయే అంశాలను ప్రజలకు సమాచారం ఇచ్చేది పాత్రికేయులేనని, అలాంటి వారిని అడ్డుకోవడం ఏంటని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ప్రతిపక్షాలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పే ఓపిక కూడా లేదన్నారు. మంత్రులు, సలహాదారులే మాట్లాడుతున్నారన్నారు. ఇదే పద్ధతి ప్రొద్దుటూరులో కూడా ఆచరిస్తున్నారని వరద అభిప్రాయపడ్డారు. ప్రజలకు సమాచారం ఇవ్వకుండా ఎమ్మెల్యే రాచమల్లు అడ్డుకోవడం సబబు కాదన్నారు. కౌన్సిల్ తీర్మానాల చర్చల్లో లొసుగులు ఎక్కడ బయటపడతాయోనని పాలకపక్షం పాత్రికేయులను అనుమతించలేదన్నారు. రానున్న రోజుల్లో కొందరు వైసిపి కౌన్సిలర్లు టిడిపి కండువా వేసుకునే అవకాశం ఉందన్నారు. అందుకే ఎమ్మెల్యే రాచమల్లుకు భయం పట్టుకుందన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు మున్సిపల్ చైర్మన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజును డమ్మీ చేశారంటూ ఎద్దేవా చేశారు. కార్యాక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ పట్టణ అధ్యక్షులు ఘంటసాల వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ అమీర్ పాల్గొన్నారు.

నారా లోకేష్‌ను కలిసిన ప్రవీణ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కుటుంబ సభ్యులతో కలిసి శ్రీశైలం సందర్శనలో భాగంగా టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ జివి ప్రవీణ్‌కుమార్ రెడ్డి లోకేష్‌ను కలిసి పలు విషయాలు చర్చించారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు.

చంద్రబాబుతోనే భవిష్యత్తుకు గ్యారంటీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మోడంపల్లెలో టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి భార్య మౌనిక, అక్క హరిత గురువారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగారు. ఈ సందర్భంగా వారు టిడిపి మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కాకి తిరుపతమ్మ, మాజీ కౌన్సిలర్ భాగ్యమ్మ, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి తాటి శ్రీనివాసులు యాదవ్, కడప పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆవుల దస్తగిరయ్య, 9వార్డు కరీముల్లా, భగసింగ్ కాలనీ పట్నం మాబాషా, గోపవరం గగ్గుటూరి గౌస్ మొహిద్దీన్, ద్వారకానగర్ కిట్టు, ద్వారకా నగర్ సుధాకర్ యాదవ్, శ్రీనివాసులరెడ్డి, మార్తల ప్రతాపరెడ్డి, హోటల్ మధు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : అభివృద్ధి, సంక్షేమం టిడిపితోనే సాధ్యమని పులివెందుల ఇన్‌ఛార్జి బీటెక్ రవి అన్నారు. గురువారం పులివెందుల మున్సిపాలిటీ చెన్నారెడ్డి కాలనీ, గాయత్రి కాలనీలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీటెక్ రవి, ఆయన సతీమణి లతారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ రాంగాపాల్‌రెడ్డి పాల్గొన్నారు. టిడిపి-జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు వివరించారు. డంజరిగింది. ఆయా కాలనీలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

'స్పందన'లో అర్జీల మోత

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో గురువారం అధికారులు ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమంలో రైతులు తమ సమస్యలు తెలిపేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చి అర్జీలిచ్చారు. మైదుకూరు శాసనసభ్యులు శెట్టిపల్లి రఘురామిరెడ్డి, బద్వేల్ ఆర్‌డిఒ ఆకుల వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మండలంలోని రైతులు వివిధ సమస్యలపై దాదాపు 400 అర్జీలు అధికారులకు ఇచ్చారు. వీటిని త్వరలోనే పరిశీలించి పరిష్కారం అయ్యేలా చూస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మైదుకూరు వైసిపి సమన్వయకర్త శెట్టిపల్లి నాగిరెడ్డి, జడ్పిటిసి రామగోవింద్‌రెడ్డి, ఎంపిపి వీరనారాయణరెడ్డి, డిటి జాన్సన్, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పట్టణాన్ని అందంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దే కార్మికుల సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను కోరామని కార్మిక సంఘ నాయకలు విజయకుమార్, సాల్మన్ తెలిపారు. మున్సిపల్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మల్లికార్జునను కార్మికులు గురువారం కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కార్మిక సంఘ నాయకలు మాట్లాడుతూ కార్మికులకు సౌకర్యాలు కల్పిండంతోపాటు విధి నిర్వహణకు అవసరమైన పరికరాలను సకాలంలో అందించాలన్నారు. సమ్మె కాలపు వేతనం ఇవ్వాలని కోరారు. సంక్రాంతి పండుగ బోనస్ అదనంగా రూ.1000 మంజూరు చేయాలన్నారు. మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలను వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు చంటి, కోశాధికారి రాఘవేంద్ర, జాకోబు, ఓబయ్య, శ్రీకాంత్, సురేష్, నాగేంద్ర, ప్రమీలమ్మ, గుర్రమ్మ, నీతమ్మ, శాంతి, అన్నపూర్ణ, మరియమ్మ పాల్గొన్నారు.